ఎస్‌సి కార్పొరేషన్ ఇడికి అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులుగా ఎస్.సి.కార్పొరేషన్ ఇడి డి.వెంకటేశ్వరరావు అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బి.రామానందం ఉద్యోగోన్నతిపై అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సాంఘిక సంక్షేమ డైరక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం వెంకటేశ్వరరావు రామానందం నుంచి సాంఘిక సంక్షేమ డిడిగా బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ 5న జిల్లాకు రాక

రాష్ట్ర మాలల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఈనెల 5న జిల్లాలో పర్యటించనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ డిడి డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తన పర్యటనలో భాగంగా ఆయా వర్గాలతో భేటీఅయి వారికి అమలు జరుగుతున్న పథకాలపై తెలుసుకుంటారని, కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమావేశమై పథకాల అమలుపై చర్చిస్తారని పేర్కొన్నారు.

అభ్యాస్ స్కూల్లో పుస్తకాల వ్యాపారం

వేసవి సెలవుల్లో తరగతులు

అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై యాజమాన్యం దాడి

విద్యాహక్కు చట్టానికి తూట్లు

ప్రజాశక్తి-రాజాం

విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కే విధంగా రాజాంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల వ్యాపారం జరుగుతోంది. వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులకు వచ్చిన సమాచారంతో పలువురు ఆ పట్టణంలోని అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూలును మంగళవారం పరిశీలించారు. పుస్తకాలనున విక్రయిస్తుండడంతో అడ్డుకున్నారు. దీంతో పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ ఎస్ఎఫ్ఐ నాయకులపైన కులం పేరుతో తీవ్ర దుర్భాషలాడుతూ భౌతిక దాడి చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జె.రవికుమార్‌ను తలభాగంలో పట్టుకొని గోడకు గుద్దడంతో ఆయన అస్వస్థతకు గురయ్యారు. అంతేకాకుండా పాఠశాల యాజమాన్యం ప్రోద్భలంతో పాఠశాల సిబ్బంది ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేశారు. సమాచారం అందుకున్న ఎంఇఒ దుర్గారావు ఘటన స్థలానికి చేరుకొని పుస్తకాల అమ్ముతున్న గదికి తాళాలు వేసి సీజ్ చేశారు. పాఠశాల యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ లేకుండా ఇంటర్నేషనల్ పేరు పెట్టడంతో పాఠశాల బోర్డును తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, ఎం.వెంకీ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల పేరుతో వేలకు వేలు రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించడం దారుణమన్నారు. యాజమాన్యాలు అదనంగా పుస్తకాలు, యూనిఫాంలో పేరుతో 15 వేల నుండి 20 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనిఅ న్నారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడే ఎస్ఎఫ్ఐ నాయకులు పై దాడి చెయ్యడం దుర్మార్గమైన చర్యని అన్నారు. తక్షణమే ఎస్ఎఫ్ఐ నాయకులపై భౌతిక దాడి చేసిన పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, అభ్యాస్ పాఠశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్, వంశీ, జిల్లా నాయకులు రమణ ,నాని ,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

యాజమాన్యాన్ని నిలదీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిఇఒకు వినతి

విజయనగరంటౌన్ : ఎస్ఎఫ్ఐ నాయకుల పై దాడికి పాల్పడిన అబ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిఇఒ మాణిక్యం నాయుడుకు ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ వినతి అందజేశారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా పుస్తకాలను అమ్ముతున్నారని, దీన్ని అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకత్వం పై పాఠశాల యాజమాన్యం దుర్భాషలు ఆడుతూ దాడికి దిగడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేసరికి జిల్లా వ్యాప్తంగా పుస్తకాల వ్యాపారం తారాస్థాయికి చేరుకుందని, అధికారులు కనీసం పట్టించుకునే పాపాన పోవడం లేదని అన్నారు. పాఠశాల ప్రాంగణంలో పుస్తకాల వ్యాపారం ఆపాలని , విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీ ఆపాలని కోరిన ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడికి పాల్పడడం సరైనది కాదన్నారు. పుస్తకాల వ్యాపారాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులదని , వారు తమ కర్తవ్యం నెరవేర్చాలని కోరారు. ప్రతి పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు ఎక్కడైనా కొనుక్కోవచ్చు అనే నిబంధనను అందరికీ కనబడేలా పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచాలని డిమాండ్ చేశారు. డిఇఒ ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

డిఇఒకు వినతినిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆండ్ర, గుర్లగెడ్డ అభివృద్ధికి నిధులు

- రైతు సంక్షేమంతోనే రాష్ట్రం సస్యశ్యామలం
- గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని ఆండ్ర రిజర్వాయర్, గుర్ల గెడ్డ ఆధునీకరణకు రూ.2కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గుర్ల మినీ రిజర్వాయర్, ఆండ్ర ఎడమ కాలువ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమంతోనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. మంగళవారం ఇద్దనవలసలో రాయితీపై విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ రైతును కష్టపెట్టినవారు, బాధలకు గురిచేసిన వారు బాగుపడ్డ దాఖలాలు చరిత్రలో లేవని అన్నారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విత్తనాలు మొదలుకొని యంత్ర పరికరాలు వరకూ రాయితీపై అందజేస్తోందని అన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని మంత్రి సూచించారు. డ్రోన్ల వాడకంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. సంప్రదాయ వ్యవసాయాన్ని కొనసాగిస్తూనే సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కోరారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపే తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా 15వేల రూపాయలు వంతున తల్లుల ఖాతాలో జమచేస్తామని చెప్పారు. ఆగస్టు15నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తామని అన్నారు. జూన్ నెలాఖరు నాటికి కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ నిధులతోపాటు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తుందని అన్నారు. మిగిలిన హామీలన్నింటినీ ప్రాధాన్య క్రమంలో దశలవారీగా నెరవేర్చుతామని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి రామారావు మాట్లాడుతూ విత్తన కొరత తలెత్తే ప్రశ్నే లేదని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డిపిఎం ఆనందరావు, మండల వ్యవసాయ అధికారి గోకుల కృష్ణ, ఎంపిడిఒ భానుమూర్తి, మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకటరావు, నాయకులు గెద్ద అన్నవరం, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి సత్యనారాయణ, రెడ్డిఆదినారాయణ, గొర్లె ముసలి నాయుడు, స్థానిక సర్పంచ్ రాయిపల్లి రామారావ, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

యోగాంధ్రలో అధికారులకు లక్ష్యాలు : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగాంధ్రలో జిల్లా అధికారులందరికీ లక్ష్యాలు నిర్దేశించినట్లు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పర్యాటక ప్రాంతాలైన చింతపల్లిలో ఈనెల 6న, రామతీర్థం 12న , తాటిపూడిలో 19న నిర్వహించే యోగా కార్యక్రమానికి ప్రతి ఒక్క అధికారి కనీసం 100 మందిని సిద్ధం చేయాలన్నారు. 10న ఎస్.కోట లో నిర్వహించే థీమ్ యోగాకు కనీసం 5 వేల మందిని సిద్ధం చేయాలని తెలిపారు. మంగళవారం తన ఛాంబర్ లో యోగా జిల్లా కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఒక్కో సచివాలయ పరిధి లో 3 బాచ్ లలో 150 మందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6.30 కే వేదికల వద్ద హాజరయ్యేలా చూడాలన్నారు. టి షర్ట్స్, యోగ మాట్స్ కూడా సరఫరా చేయాలని తెలిపారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోని వారుంటే వారికోసం రిజిస్ట్రేషన్ డెస్క్ ను వేదిక వద్ద ఏర్పాటు చేసి అప్పటికప్పుడే రిజిస్టర్ చేయాలని సూచించారు. ఈనెల 21 న ప్రధాన మంత్రి కార్యక్రమానికి భీమిలి బీచ్ లో హాజరు కావడానికి జిల్లా నుండి లక్ష మందిని మొబలైజ్ చేయాలని తెలిపారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి , జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, రవాణా ఉప కమిషనర్ ఫణికుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ ఇంచార్జ్ డిడి వెంకటేశ్వర రావు, మెప్మా పీడీ , డిఎస్ఒ, హౌసింగ్ పీడీ , డ్వామా పీడీ, డిఇఒ, తదితర అధికారులు పాల్గొన్నారు.

వాకౌట్ చేసి బయటకు వచ్చేస్తున్న టిడిపి సభ్యులు

సభ్యులకు సమస్యలు పట్టవా?

- సమస్యలపై చర్చ లేకుండా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం
- ఎంపిపి నియంతగా వ్యవహరిస్తున్నారంటూ టిడిపి సభ్యులు వాకౌట్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

అది మండల సర్వసభ్య సమావేశం. మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించే వేదిక. అలాంటి వేదికను సభ్యులు నిరూపయోగంగా మార్చుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాలి. అలాంటి వేదికలపై సభ్యులు గొవడలు పడుతూ సమస్యలను గాలికి వదిలివేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపిపి మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి ముఖ్య అతిదిగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు హాజరయ్యారు. ముందుగా అజెండాలోని అంశాల వారీగా అధికారులు చదివారు. ఉపాధి హామీ ఎపిఒ రవి మండలంలో జరుగుతున్న పనులను వివరిస్తున్న సమయంలో ఎంపిపి అప్పలనాయుడు మేట్‌ల విషయంపై మాట్లాడారు. దీంతో ఎంపిపి, ఎపిఒ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. డిఆర్‌డిఎలో విఒఎ పోస్టుల నియామకాలపై తనకు తెలియకుండా చేశారని ఎంపిపి అధికారులను ప్రశ్నించారు. ఎంపిపి ఎక్కువ సమయం మాట్లాడడంతో టిడిపి సభ్యులు రాకోడు ఎంపిటిసి సభ్యులు వేచలపు శ్రీనివాసరావు, జొన్నవలస ఎంపిటిసి సభ్యులు రాజేష్ వర్మ ప్రశ్నించారు. ఇంకా 20 శాఖలపై ఎప్పుడు చర్చ ఉంటుందంటూ సభ్యులు వాకౌట్ చేశారు. సమావేశంలో ఎంపిడిఒ గంటా వెంకటరావు, మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు వెన్నుపోటు పొడిచింది వైసిపియే

టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రజలకు వెన్నుపోటు పొడిచింది వైసిపియేనని విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డికి ప్రజలు 151 సీట్లు ఇస్తే ప్రతి వర్గాన్ని ఇబ్బంది పెట్టారన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డిని విమర్శించారు. మద్యం నిషేధమని చెప్పి మద్యం రేట్లు పెంచి కల్తీ మద్యాన్ని అందించారన్నారు. పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలకు దూరం చేశారన్నారు.ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టునుచంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తే జగన్మోహన్ రెడ్డి వదిలి వేశారని విమర్శించారు. ఉచిత బస్సు, విద్యార్థులకు తల్లికి వందనం త్వరలోనే ఇస్తామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు పాల్గొన్నారు.

పేదలు, కార్మికులకు వెన్ను పోటు పొడిచిన జగన్ : ఎమ్మెల్యే అదితి

మెగా డిఎస్‌సి హామీపై మాట తప్పి యువతకు, అన్న క్యాంటీన్ లు రద్దు చేసి పేదలు, కార్మికులకు జగన్ వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభించి ఎంతోమంది పేదలకు మేలు చేసిందన్నారు. 16,347 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్నామన్నారు. దీపం-2 కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం ద్వారా సుమారు 20 వేల కి.మీ రహదారులు బాగుచేశామని పేర్కొన్నారు. చెత్త పన్ను రద్దు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించామని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోనే అధిక శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం మరొకటి లేదని అన్నారు. వైసిపి చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు.

గర్భిణుల మృతిపట్ల కలెక్టర్ ఆగ్రహం

తప్పుచేసిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవు

ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వివిధ కారణాలతో ప్రసవ సమయంలో, ప్రసవానంతరం గర్భిణులు, శిశువులు మృతి చెందడం పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. తప్పు చేసినవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎంపిసిడిఎస్ఆర్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. నవంబరు 24 నుంచి మార్చి 25 వరకు జిల్లాలో సంభవించిన 4 మాతృ మరణాలు, 5 శిశు మరణాలపై సమావేశంలో చర్చించారు. మృతికి కారణాలు, సిబ్బంది లేక వైద్యుల నిర్లక్ష్యం, ఏ స్థాయిలో తప్పిదం జరిగి ఉంటుంది తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. వైద్యులను, ఐసిడిఎస్ సిబ్బందిని, ఆశా, ఎఎన్ఎంలను ప్రశ్నించారు. అన్ని రకాల రికార్డులు తమకు సమర్పించాలని ఆదేశించారు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రుల ప్రతినిధులు సమావేశానికి రావకపోవడంపై మండిపడ్డారు. గర్భిణిలు వెంపడాపు లీలావతి, బంగారి సుధ మరణంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించారు. కొరమ దుర్గ మృతి విషయంలో పిజి స్టార్ ఆసుపత్రికి నోటీస్ ఇవ్వాలని, అలాగే మరో మృతికి సంబంధించి, సమావేశానికి కెజిహెచ్ వైద్యులు హాజరుకాకపోవడంతో, కెజిహెచ్ సూపరింటిండెంట్‌కు కూడా డిఒ లెటర్ రాయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మాత, శిశు మరణాలు సంభవించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది ఇస్తున్న నివేదికలు పొంతన లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో ఇరు శాఖల అధికారులు నెలకోసారైనా సమావేశమై చర్చించుకోవాలని సూచించారు. జిల్లాలో మాతశిశు మరణాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శుభశ్రీరాణి, ఘోషాసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శుభశ్రీ, డిఐఒ డాక్టర్ అచ్యుతకుమారి, సిడిపిఓ ప్రసన్న, పలువురు వైద్యాధికారులు, ప్రయివేటు ఆసుపత్రుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

నేడు వైసిపి ఆధ్వర్యాన వెన్నుపోటు దినం

జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని, ఈనేపథ్యంలో బుధవారం చేపట్టనున్న నిరసన ర్యాలీలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు, అసెంబ్లీ కమిటీలు, మండల కమిటీలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ స్థాయి నాయకులు నిరసన ర్యాలీలో పాల్గొనాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ 'వెన్నుపోటు దినం' పేరిట చేపట్టిన ఈ ర్యాలీలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

ప్రేమ సమాజం చరిత్ర మహోన్నతమైనది

కేంద్ర మాజీమంత్రి అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎందరో అనాధలకు, వయో శ్రేష్టులకు ఆశ్రయాన్నిచ్చి ఆదుకున్న ప్రేమ సమాజం చరిత్ర మహోన్నతమైనదని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రేమ సమాజాన్ని సందర్శించి ప్రేమ సమాజం చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ నిస్వార్థమైన సేవలతో ప్రేమ సమాజం సముచిత స్థానాన్ని సంపాదించుకున్నదని పేర్కొన్నారు. ప్రేమ సమాజానికి దాతలుగా వ్యవహరిస్తున్నవారికి ఈ ఘనత దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, కోశాధికారి బలివాడ అప్పారావు, ముఖ్యసలహాదారు వి.సుబ్బరాజు, సహాయ కార్యదర్శులు సిహెచ్.చిన్నయ్య అల్లంకి బసవమూర్తి, పి.జ్ఞానేశ్వర్, వి.ఆంజనేయులు, కె.ఎర్రి నాయుడు, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, కె.వి.ఎస్.యన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించండి

భారీ పరిశ్రమలశాఖా మంత్రిని కోరిన మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

ప్రజాశక్తి-విజయనగరం

వాణిజ్య, భారీ పరిశ్రమల శాఖా మంత్రి టిజి.భారత్‌తో మాజీ మంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు విజయవాడలో భేటీ అయ్యారు. విజయనగరం జిల్లాలో పరిశ్రమల స్థితిగతులను వివరించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను తెలిపారు. ప్రధానంగా బొబ్బిలి గ్రోత్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. ప్రస్తుతం బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో ఉన్న అనుకూల వసతులను మంత్రి భరత్ కు సుజయ్ తెలిపారు. గతంలో భూములు పొంది కాలయాపన చేస్తున్న యాజమాన్యాలను గుర్తించి వారితో కుదుర్చుకున ఒప్పందాలను రద్దు చేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు స్థాపించకుండా విలువైన పారిశ్రామిక వాడను నిర్వీర్యం చేస్తున్నారని సదరు యాజమాన్యాలను సహించవద్దని మంత్రికి తెలిపారు. అనేక మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు గ్రోత్ సెంటర్ లో పరిశ్రమలు పెట్టేందుకు తనను సంప్రదిస్తున్నారని, వారికి భూములు ఇవ్వాలని మంత్రి భరత్‌ను కోరారు. ఈ సందర్భంగా వినతి అందజేశారు.

ఎండిఎం కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. పట్టణం లోని మంగళవారం మధ్యాహ్నం భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తేరకొర డబ్బులిచ్చి నాణ్యమైన పౌష్టికాహారం ఎలా వస్తుందని ప్రశ్నించారు. కనీస వేతనాలు ఇచ్చి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20 పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు మార్పుకు, లేబర్ కోడ్ చట్టాలు రద్దు చేయాలని కోరుతూ జూలై9న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, ఎండిఎం నాయకులు రామలక్ష్మి, ఆదిలక్ష్మి, చంద్రకళ, రాములమ్మ, విజయ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న శంకరరావు

యోగాతో శారీరక,మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు అన్నారు. దాసన్నపేట విద్యుత్‌భవన్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. యోగా గురువు కె.శశిభూషణరావు ..అధికారులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో డిజియం కెవి లక్ష్మీనారా యణ, ఎస్ఎఒ ఎస్. అప్పలనాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.మురళీకృష్ణ, జి.సురేష్‌బాబు, పి.త్రినాధ్, కెవి సత్యన్నారాయణ, విద్యుత్ భవన్‌లోని డిఇలు, ఎఇలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన యోగాంధ్ర పోటీలు

అర్బన్ స్థాయి రెండోరోజు యోగాంధ్ర పోటీలను సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ పోటీలు ఈనెల 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. బాల్య , యుక్త వయసు, మధ్య వయస్కులు, వృద్ధులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐలు, పీడీలు, పిఇటిలు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

బాలాజీ జంక్షన్ లో యోగాసనాలు

స్థానిక అంబేద్కర్ జంక్షన్ ఎల్లమ్మ ఆలయం వద్ద యోగాసనాలను నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, టిపిఆర్ఒ సింహాచలం, నగరపాలక సంస్థ సిబ్బంది, క్రీడాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది

కేంద్రీయ విద్యాలయంలో భాషా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆదేశానుసారం కేంద్రీయ విద్యాలయంలో 3నుంచి 8వ తరగతి విద్యార్థులకు భారతీయ భాషా శిక్షణ తరగతులు సోమవారం నుంచి 10.తేదీ వరకు జరగనున్నాయని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ దిలీప్‌మోడీ తెలిపారు. ఈ తరగతులలో వివిధ భాషలపై అవగాహన కల్పిస్తూ, ప్రత్యేకంగా ఒకభాష (మలయాళం) విద్యార్థులకు నేర్పిస్తారని తెలిపారు.

అవయవ దానానికి రిటైర్డ్ ఎంఇఒ అంగీకారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రిటైర్డ్ ఎంఇఒ ఈపు విజయ్‌కుమార్ అవయవ దానానికి అంగీకారం తెలిపారు. ఆయన మరణానంతరం తన భౌతిక శరీరం మిమ్స్ కళాశాలకు ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. ముఖ్యంగా వైద్యరంగంలో రీసెర్చ్‌ల కోసం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలని, తన శరీరంలో పనికొచ్చే అవయవాలు ముఖ్యంగా కళ్ళు, అవసరమైన వాళ్లకి ఉపయోగించాలని ఈ నెల 2న కుటుంబ సభ్యులు అంగీకారంతో నెల్లిమర్ల మిమ్స్ కాలేజీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ ఎనాటమి డాక్టర్ పి.అనిల్‌కుమార్ డిక్లరేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ డీన్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఆఫ్ అనాటమీ ఆయన్ను అభినందిస్తూ లెటర్ అందజేశారు.

ఓర్వలేకే వెన్నుపోటు దినం : టిడిపి

ప్రజాశక్తి-గజపతినగరం

సొంత బాబాయిని హత్యకు గురిచేసి, తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచి వైసిపి అధినేత జగన్ వెన్నుపోటు రాజకీయాలు చేశారని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎంపిపిలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్ మాట్లాడారు. సొంత చెల్లి, తల్లిని రోడ్డుపై నిలబెట్టి వారి ఆస్తిని లాక్కుని వారికి వెన్నుపోటు పొడిచారని అన్నారు. మేనిఫెస్టోని నమ్మి ఓటు వేసిన నిరుద్యోగ యువతను నట్టేటా ముంచారన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకొని రాకపోవడంతో పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని అన్నారు. అవినీతి, భూ కబ్జాలతో పేదలను భయబ్రాంతులకు గురి చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రజలకు వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ, ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందు తోందన్నారు. గ్రామస్థాయిలో పార్టీకి వచ్చే ఆదరణ చూసి ఓర్వలేక నేడు వెన్నుపోటు దినం అనే కార్యక్రమా లను నిర్వహిస్తున్నారని అన్నారు. గతంలో ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి నేడు వెన్నుపోటు దినం నిర్వహించడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమావేశంలో సర్పంచ్ బుజ్జిరాజు, ఐదు మండలాల నాయకులు, పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వ్యసాయం కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున ఈనెల 4న బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణపనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతరిమి,పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సైకిలింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - బొబ్బిలి

సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని శ్రీవీరంజనేయ బొబ్బిలి పట్టణ సైకిల్ మెకానిక్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు యడ్ల లక్ష్మణరావు, లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు మొకర గౌరీ అన్నారు. పట్టణంలో మంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని నిర్వహించి సైకిల్ ర్యాలీ చేశారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యాన్ని సొంతం చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. సైకిల్ తొక్కేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్లు పరిశీలన

ప్రజాశక్తి - కొత్తవలస

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ యస్.ప్రసాద్ రావు, జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి వి.ఆదినారారాయణ మంగళవారం సందర్శించి పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు వచ్చిన స్టూడెంట్ కిట్స్‌ను అయిటమ్స్ వారీగా నాణ్యతను పరిశీలించారు. పాఠశాల వారీగా అన్ని అయిటమ్స్‌ను ప్యాకింగ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. ఇంకా రాని అయిటమ్స్‌ను అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్స్, షూస్, మీడియం బేగ్స్ రావల్సి ఉందని ఎంఇఒ తెలియజేశారు. పాఠశాలలకు చేర్చిన కిట్ లను మెగాపేరెంట్ మీటింగ్ రోజున అందరికీ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీదేవి, బి.శ్రీనివాసరావు, మండల టీమ్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు పంచాయతీ పరిధిలో కడకొండ గిరిజన గ్రామంలో దుర్గాలమ్మ తల్లి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వారిచే డాన్స్ బేబీ డాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం యూత్, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి

ప్రజాశక్తి- వేపాడ

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నియోజకవర్గ కేంద్రంలో బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినంకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని వైసిపి మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు తెలిపారు. ఆయన మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వీలుపర్తిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తిలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 29 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 21 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఆర్థోపెటిక్ వైద్యానికి ఐదుగురు ఎంపిక కాగా వారిని నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ వైద్య శిబిరం సర్పంచ్ సేనాపతి లీల, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్ద సేనాపతి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు బి. తనుజ, ఎల్.స్వాతి, కె.మౌనిక, కె.లక్ష్మి సునంద, కె.భరద్వాజ్, బి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వులో నవ ధాన్యాల సాగు పరిశీలన

వేపాడ: మండలంలో ఉన్న 6 యూనిట్స్‌లో నువ్వుల్లో నవధాన్య పంటను మంగళవారం డిపిఎంయు సిబ్బంది సందర్శించి పరిశీలించారు. కుమ్మపల్లి యూనిట్ డిఎల్ఎమ్‌పి స్వామి నాయుడు, ఆకుల సీతంపేట యూనిట్ ఎన్ఎఫ్ఎ వరప్రసాద్, కరకవలస, పాటూరు యూనిట్స్ ఎన్ఎఫ్ఎ రమేష్, వీలుపర్తి కేజీపూడి యూనిట్స్ ఎన్ఎఫ్ఎ శంకర్ పరిశీలనలో పాల్గొన్నారు. ఆ యూనిట్స్‌లో ఉన్న ప్రతి గ్రామంలో నవధాన్య పొలాలను సందర్శించి టార్గెట్ ప్రాప్తికి కిట్లు పంపిణీ జరిగిందా లేదా పంపిణీ చేసిన కిట్లు ప్రాప్తికి గ్రౌండ్ జరిగిందా లేదా అనేది క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కిట్లకు సరిపడా విత్తనాలు వారి వద్ద ఉన్న వాటిని తనిఖీ చేశారు. నవధాన్యాలు వేసిన పొలాలకు వేయని పొలాలకు తేడాలను రైతులకు వివరించారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం

ప్రజాశక్తి-చీపురుపల్లి

పదవులు తీసుకున్న ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. జిల్లా అనుబంధ విభాగాలు అధ్యక్షులు ప్రచార విభాగం వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, సోషల్ మీడియా విభాగం వై.వాసు నాయుడు, సాంస్కృతిక విభాగం డా. బలివాడ నరేంద్ర కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షులు గందవరపు హేమంత్ కుమార్, చీపురుపల్లి అసెంబ్లీ సోషల్ మీడియా కో- కన్వీనర్ ఎల్. ప్రభాత్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా బెల్లానను ఆయన నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా తమపై నమ్మకంతో ఈ పదవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో అందర్నీ కలుపుకుని పార్టీని మరింత పటిష్టంగా బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామని తెలియచేస్థామని వారు బెల్లనకు తెలిపారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి సహకారాలైనా అందిస్తామని పార్టీకి ప్రతి ఒక్కరి అండ దండలు ఉండాలని, 4తేదీన జరగబోయే వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జిపురపు విజయ్, మహంతి మురళి, వెంకీ, గణేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దేవుదలలో పశువైద్య కేంద్రానికి తాళం

- పశువుల వైద్య సేవలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల గ్రామంలో ఉన్న గ్రామీణ పశువైద్య కేంద్రం నిత్యం తాళాలు వేసి ఉండడంతో పశువైద్యం కోసం వచ్చిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవుదలతో పాటు చిన్నపుర్లి, పెద్దపుర్లి, గోపెంపేట వంటి తదితర మరో నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 15,630 మంది రైతులు తమ పశువుల చికిత్స కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పశు వైద్య కేంద్రం ఒకప్పటి కీలక కేంద్రంగా ఉండగా, గత ఐదేళ్లుగా ఎటువంటి వైద్య సేవలూ అందకపోవడంతో అలంకార ప్రాయంగానే ఉంది. గేదెలు, ఆవులు, మేకలు, కోళ్ళు, శునకాలు మొదలైన పశు పక్ష్యాదుల వైద్యం కోసం వస్తే ఈ కేంద్రం అప్రయోజనంగా మారిపోయిందని రైతులు విమర్శిస్తున్నారు. వినియోగంలో లేకపోవడంతో ఆ పశు వైద్య కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో పశు వైద్యం కోసం అవసరమైన సమయంలో, రైతులు సుదూర ప్రాంతమైన సంకిలి లోని పశు వైద్యశాల వరకు ప్రయాణించాల్సి రావడంతో ఖర్చుతో పాటు సమయ నష్టానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఇది మరింత తీవ్రమైన సమస్యగా మారిందని స్థానికులు, రైతు సంఘాలు నాయకులు వాపోతున్నారు. ఇక్కడ ఒక వైద్యులు, ఒక అటెండర్ పోస్ట్ మాత్రం ఉంది. ఇక్కడ పర్మినెంట్ ఉద్యోగి శంకరరావు గరివిడి మండలం డిప్యూటేషన్‌పై వెళ్లి ఐదేళ్లు పూర్తయిన నేటి వరకు వైద్యులను నియమించకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యశాలకు వైద్యులు లేకపోవడంతో ఈ ఎనిమిది గ్రామాల రైతులు పశుపక్షాదాలకు వ్యాధులు సంభవిస్తే ఎలా వైద్యం చేయించాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. మరి కొన్ని సందర్భాల్లో ఇక్కడ వైద్య సేవలు లేక పశుపక్షాదులు రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇంకా సరైన స్పందన రాలేదని వాపోతున్నారు. పశువైద్య సేవలను పునరుద్ధరించాలని, కొత్త డాక్టర్‌ని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మూతపడిన దేవుదల పశువైద్య కేంద్రం

పశువైద్య సేవలందించాలి

దేవుదలలో పశువైద్య కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసింది. పశువైద్య కేంద్రం ద్వారా రైతుల పశు పక్షాదాలకు వైద్యసేవలు గతంలో అందేవి. గత ఐదేళ్లుగా డాక్టరు, సిబ్బంది లేక వైద్య సేవలు కొరతగా ఉన్నాయి. ప్రభుత్వ అధికారులు, పాలకులు స్పందించి పశువైద్య సేవలు అందించాలి.

కప్పిలి దుర్గమ్మ, సర్పంచ్, దేవుదల

బాలికపై అనుచిత ప్రవర్తన

◆ బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ ◆ యువకునిపై సైబర్, పోక్సో కేసులు నమోదు

ప్రజాశక్తి - రామభద్రపురం

15 ఏళ్ల స్థానిక బాలికపై మెరకముడిదాం మండలం బైరిపురం గ్రామానికి చెందిన యువకుడు అనుచిత ప్రవర్తనకు పాల్పడి బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో బాలిక తన కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కొద్ది రోజుల్లోనే నిందితున్ని పట్టుకొని మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితున్ని ప్రవేశపెట్టి కేసు వివరాలను బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి వివరించారు. ఈ కేసులో నిందిత యువకుడు ఒడిశా రాష్ట్రంలో ఐటిఐ చదువుతూ స్నేహితుల సహచర్యంలో వివిధ మొబైల్ యాప్‌లు వాటిలో చెడ్డ పనులు చేసే విధానాలు నేర్చుకున్నాడు. ఈ క్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో బాధిత యువతిని చూసి ఈ యువతి ఇన్‌స్టా ఫాలోవర్స్‌లో ఒకరి ఫోటోతో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపి పరిచయం పెంచుకున్నాడు. తదుపరి బాధిత మైనర్ బాలిక ఫోటోను ఎఐ సహాయంతో వివస్త్రగా తయారు చేసి ఆ ఫోటోలు బాధిత బాలికకు షేర్ చేసి బ్లాక్‌మెయిల్‌కు దిగాడు. మొదట 5 వందలు అడిగి నిరాకరించడంతో 8వేలు అడిగాడు. డబ్బులు ఇచ్చేది లేదని చెప్పడంతో వివస్త్రగా తయారు చేసిన ఫోటోలు సోషల్ మీడియా, గూగుల్ యాప్‌లలో షేర్ చేస్తానని వేధించడం మొదలు పెట్టాడు. దీంతో కంగుతిన్న ఆ బాలిక ఇందులో తన తప్పు ఏమీ లేదని గ్రహించి వెంటనే ఈ విషయాల్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు మే 2న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇక్కడ కేసు నమోదు చేశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన జిల్లా ఎస్‌పి జిందాల్ బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు మరికొందరు పోలీసులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించారు. ఈ టీమ్ తమదైన శైలిలో వివిధ టెక్నాలజీల సహాయంతో నిందితున్ని గుర్తించి అతడి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని ఆధారాలు గుర్తించి కేసు నమోదు చేసింది. తమ విచారణలో నేరాన్ని అంగీకరించడంతో యువకునిపై సైబర్ క్రైమ్‌తో పాటు పోక్సో కేసు, ఐటి యాక్ట్‌లో ఉన్న కేసులు నమోదు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

1930కు ఫిర్యాదు చేయాలి

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

బాలికలు, స్త్రీలు, యుక్త వయసులో ఉన్న అమ్మాయిలు తమకు ఏదైనా అత్యవసరం అనిపిస్తే 1930కు కాల్ చేయాలని డిఎస్‌పి భవ్యరెడ్డి తెలిపారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మహిళలపై నేరాలు చేస్తున్నట్లు కేసులు నమోదు అవుతున్నాయని వాటిని ధీటుగా తిప్పి కొట్టేందుకు సహకరించాలని కోరారు. తెలియని వ్యక్తులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టడం అంగీకరించడం చేయవద్దు అన్నారు. గుర్తింపు లేని యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. ప్రభుత్వం మహిళా భద్రతకు పెద్దపీట వేస్తుందని ప్రతి ఒక్కరూ భద్రతా యాప్‌లు ఉంచుకుని రక్షణా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు, ఎఎస్ఐ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రక్ష యోగా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - లక్కవరపుకోట

యోగా ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాసనాలు చేసి ఆరోగ్యం కాపాడుకునే విధంగా ఉండాలన్నారు. ప్రతి రోజు ఉదయాన్నే ఈ యోగా కార్యక్రమాన్ని చేసే విధంగా ఉంటే అనారోగ్యాలు దూరం అవుతాయని డాక్టర్ వద్దకు వెళ్ళనవసరం లేదని ఆమె తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి ఎపి ఆదర్శ పాఠశాల వరకు అధికారులతో కలిసి ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, డిఎంజిఎన్ ప్రసాద్ రావు, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎస్ఐ నవీన్ పడాల, డాక్టర్ బి.అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దాసరి స్వరూపి, జిల్లా కమిటీ సభ్యులు గొల్ల దేవి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రామభద్రపురం: బాల్య విద్యాభ్యాసం నుంచి యోగా సాదన చేస్తే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని స్థానిక లైబ్రేరియన్ సత్యవాణి తెలిపారు. వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా గ్రంథాలయంలో మంగళవారం యోగాపై అవగాహన కల్పించి వివిధ ఆసనాలు వాటి ప్రయోజనాలు వివరించారు. యోగాతో మంచి ఆరోగ్యం, శారీరిక పటుత్వం, ఆత్మ విశ్వాసం లభిస్తాయన్నారు. అనంతరం యోగా సాధన పుస్తకాలు చదివించి వివిధ ఆటలు ఆడించారు.

సచివాలయాల్లో ప్రారంభమైన యోగా

వేపాడ: మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో ఈ నెల 3 నుంచి 16వ తేదీ వరకు కార్యదర్శులు ఆధ్వర్యంలో చేపట్టనున్న యోగా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గూర్చి సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులు వివరించారు. యోగా కార్యక్రమాల నిర్వహణపై పర్యవేక్షకులుగా ఇఒపిఆర్‌డి రవికుమార్, ఎపిఒ ఆదిలక్ష్మిని నియమించినట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు.

ఎల్‌కోట: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల

వసతి గృహాలు సందర్శన

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కృష్ణప్రసాద్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ. కృష్ణ ప్రసాద్ మంగళవారం మండలంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, బొప్పడం, అలుగోలు, మొయిద బిసి బాలుర వసతి గృహా లను సందర్శించారు. బాలుర వసతి గృహంలో గదులు, మరుగుదొడ్లు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. అన్ని రూములను, డైనింగ్ హాలు, వంట గదులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మొయిద వసతి గృహం ప్రహరీ ముందు భాగం కూలి ఉన్నట్లుగా గమనించి ఏం జరిగిందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను అడుగగా హుదూద్ తుఫాన్‌కు కూలిపోయినట్లు తెలియజేశారు. నెల్లిమర్ల సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ సందర్శనకు వచ్చినప్పుడు హాస్టల్‌కి సంబంధించిన సిబ్బంది ఎవరూ లేకపోవడం, వసతి గృహనికి తాళాలు వేసి ఉండడంతో అసహనం వ్యక్తం చేసి వెళ్లిపోయారు.

స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న సిఐ, ఎస్ఐ

స్టాపర్స్ ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండల కేంద్రంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలపై గత నెల మే 12వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురించిన 'పద్మవ్యూహం' అనే కథనానికి స్పందించిన సిఐ జివివి రమణ, ఎస్ఐ కిరణ్ కుమార్‌నాయుడు మంగళవారం వద్ద స్టాపర్స్ ఏర్పాటు చేశారు. వీలై నంత తొందరలో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెన్నుపోటుకు పేటెంట్ జగనే : కర్రోతు

ప్రజాశక్తి- భోగాపురం

' వెన్నుపోటు..గొడ్డలివేటు' పేటెంట్ జగన్ రెడ్డిదేనని ఆస్తి కోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి, కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచాడని ఎపి మార్క్‌ఫెడ్ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలోని జగన్ వెన్నుపోటు అంశంపై మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ని అడ్డంపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపి పార్టీని స్థాపించిన జగన్ వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. శివకుమార్ స్థాపించిన వైసిపిని కబ్జా చేసి ఆయనకు వెన్నుపోటు పొడిచాడన్నారు. కూటమి పాలనలో తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసి మొదటి నెలలోనే రూ.4వేలు పింఛన్ పెంచి అమలు చేశామన్నారు. త్వరలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధిచిన నగదు కూడా వేస్తామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కోరాడ తాతారావు, సిరివూరు మౌళి వర్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు ఫారమ్ పాండ్స్ నిర్మాణాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

జిల్లాలో ఈ ఏడాది 7,856 ఫారం పాండ్స్ నిర్మాణాలు చేపట్టడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఉపాధిహామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రమామణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెలాఖరుకు 3,822 ఫారం పాండ్స్ పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. బండ్ ట్రెంచులు, రింగ్ ట్రెంచుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సీజన్‌లో హార్టికల్చర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, ఈ వర్షాకాలంలో ఎక్కువగా మొక్కలు నాటడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ప్రతి వేతనదారునికి రూ.307లు కనీస వేతనం అందించే విధంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. వేతనదారుల డిమాండ్ బట్టి పనులు మంజూరు చేస్తున్నామన్నారు. వేతనదారులకు బిల్లులు సకాలంలో చెల్లించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. అంతకుముందు ఆమె మామిడివలస, మిర్తివలస గ్రామాల్లో ఉపాధి పనులు పరిశీలించారు.

మలేరియా నివారణ మాసోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎం.వేణు, డాక్టర్ ఏ.సంజన ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నివారణ గూర్చి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ వివి రమణ, పిహెచ్‌సి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

లారీ ఢీకొని సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ తూముల సత్యం (52) మృతి చెందారు. పోలీసులు వివరాలు మేరకు బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన సత్యం బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు మోటార్ సైకిల్ పై మంగళవారం వెళ్తుండగా పారాది వద్ద బస్సును ఓవర్ టాక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటన జరిగిన వెంటనే పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10వేలు జరిమానా

రామభద్రపురం: స్థానిక పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో మంగళ వారం డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డ బాడంగి మండలం డొంకిన వలస గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి సాలూరు కోర్టుకు తరలించారు. అక్కడ న్యాయమూర్తి హర్షవర్ధన్ విచారణ జరిపి నేరం రుజువు కావడంతో 10వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేపడతామని ఎంతటివారైనా పట్టుబడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన కందివలస వాసుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గణేష్ మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానని చెప్పి మాయ మాటలతో వశపరచుకొని ఆమెని శారీరకంగా అనుభవించి పెళ్లికి నిరాకరించిన నేపథ్యంలో పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేపరు పబ్లికేషన్
మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ వారి కోర్టులో
O.S 22/2024

Between :
Sri Mamidi Chinna Appayya .....వాది
And :
Sri Meesala Papi Naidu ......ప్రతివాది
To:
ప్రతివాది అడ్రసు :
శ్రీ మీసాల పాపినాయుడు, తండ్రి లేటు అప్పలస్వామి, హిందూ, వయస్సు సుమారు 34 సం॥, తాపీమేస్త్రీ, సా॥ కోణిశ గ్రామము, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా.

Hg Date: 20-06-2025

పై నెంబరు దావాలో ప్రతివాది నోటీసు తీసుకొనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 20-06-2025దీ**న హాజరు నిమిత్తము **ఉదయం గం॥ 10-30 ని॥**లకు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పైన తెలిపిన కోర్టులో హాజరు అయి ఎమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియజేయవలసిందిగా కోరడమైనది. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందు మూలకముగా ప్రతివాదికి తెలియజేయడమైనది.

"By Court Order"

శ్రీ ఉప్పలపాటి రమేష్
వాది తరపు న్యాయవాది
గజపతినగరం,
సెల్: 9866454030

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P. 2/2025

Between :
గేదెల సరిత .....పిటీషనరు
And :
కుప్పిలి సురేష్ కుమార్ వగైరాలు....రెస్పాండెంట్స్

యిందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటీషనరును ఇన్సాల్వెన్సీగా ప్రకటించమని కోరుచూ పై నెంబరు పిటీషను దాఖలు చేసియున్నారు. అందులకు ఎవరికైనా ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టువారి ఎదుట **తే 16-06-2025దీని ఉదయం 10-30 గంటలకు** స్వయముగా కాని, వకీలు ద్వారా కాని హాజరు కావలసినదిగా యిందు మూలముగా తెలియచేయడమైనది.

Ch.V. Srinivasa Rao
Advocate for the Petitioner
Vizianagaram

మహారాజ శ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి కోర్టులో
I.P.No.21/2024

Between :
1. పసుమర్తి శ్రీను
2. పసుమర్తి రూపావాణి ......పిటీషనర్లు
And :
తాత్రాజు అనిల్ వగైరాలు ......రెస్పాండెంట్లు
To:
R.7. కనుక రమణమ్మ W/O శ్రీను, గృహిణి, R/O. దుర్గానగర్, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.9. బోని శ్రీనివాసరావు. S/O. లేటు నరసింహమూర్తి, టిఫిన్ షాపు, R/O. దిబ్బగుడ్డి గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా.
R.10. రెవళ్ళ సూరిబాబు, S/O. లేటు బంగారయ్య, వడ్డీ వ్యాపారం, R/O. దొంగలివీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.11. బోడసింగి లక్ష్మీ W/O. గోవింద, గృహిణి, R/O. రెడ్డివీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.13. దొంతల రాంబాబు, S/O. లేటు రాము, వ్యవసాయం, R/O. రెడ్డివీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం
R.14. డి.మీనా, W/o గంగడు, గృహిణి, R/O చుక్కవీధి. వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.15. బూతాత, S/O. రాములు, వ్యవసాయం, R/O. భూ వారి కల్లాలు, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.17. పూసర్ల ప్రకాష్, S/O. లేటు రామారావు. వ్యాపారం, R/O. మజ్జివలస గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం.
R.18. గెద్ద సన్యాసమ్మ W/o. లేటు సోములు, గృహిణి, R/o పెద్దవీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.24. యర్ర ఉమాగౌరి, W/O. ఎర్రయ్య, వాలంటీర్, R/o పెద్దవీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.25. సియాద్రి చంద్రరావు, S/O సూర్యనారాయణ, వ్యాపారం, R/O కోరాడపేట గ్రామం, విజయనగరం మండలం మరియు జిల్లా.
R.30. గొలగాని శ్రీను, S/O. తాత, ఆటో డ్రైవర్, R/O. రెడ్డివీధి, వి.టి. అగ్రహారం, విజయనగరం.
R.32. కూర్మ వెంకటరమణ, S/O. లేటు నరసింహమూర్తి, కిరాణాషాపు, R/O. బియ్యాలపేట, డెంకాడ మండలం, విజయనగరం.
R.33. చందక ఈశ్వరరావు, S/O. రాములప్పుడు, వ్యవసాయం, R/O. ఐనాడ జంక్షన్, చింతలవలస దగ్గర, విజయనగరం.
R.36. రమణ, వడ్డీ వ్యాపారం, R/O. గాంధీనగర్, వర్క్ షాపు దగ్గర, వి.టి. అగ్రహారం, విజయనగరం.
40. కూర్మ వెంకటరమణ, బియ్యాలపేట, డెంకాడ మండలం, విజయనగరం.
R.41. స్వామియే శరణం అయ్యప్ప ఫైనాన్స్, ప్రొ॥ బాలా కృష్ణారెడ్డి, వడ్డీ వ్యాపారం, R/O. ఇంద్రానగర్, విజయనగరం.
R.42. రెడ్డి ఫైనాన్స్, ప్రొ॥ శాంతి వెంకట రామారెడ్డి, వడ్డీవ్యాపారం, R/O. రింగ్ రోడ్డు, వెంకటేశ్వర స్వామి ఆర్చ్ దగ్గర, విజయనగరం.
R.44. సంతోష్ ఫైనాన్స్, ప్రొ॥ సంతోష్, R/O. ఆనంద్ ప్లాజా, ఎల్.ఐ.సి. బంక్ వెనుక వైపు, విజయనగరం.
R.45. శ్రీ లక్ష్మీ గణపతి ఫైనాన్స్, ప్రొ॥ పదాల వర్క్ రెడ్డి, R/O. పద్మావతినగర్, ధర్మపురి, విజయనగరం.
R.46. పార్వతీ పరమేశ్వర ఫైనాన్స్, ప్రొ॥ విజయారెడ్డి, R/o. రింగ్ రోడ్డు, వెంకటేశ్వర స్వామి ఆర్ట్ దగ్గర, విజయనగరం.
R.47. రామారావు వీక్లీ ఫైనాన్స్, ప్రొ॥ రామారావు. R/o. ధర్మపురి జంక్షన్, విజయనగరం.
R.53. బజాజ్ ఫిన్ సెర్వ్, Rep., by బ్రాంచ్ మేనేజర్, పర్సనల్ లోన్, R/O. విజయనగరం.
R.55. వెరిటేజ్ ఫైనాన్స్, Rep., by బ్రాంచ్ మేనేజర్ బి. సంతోష్ కుమార్, R/C. సన్ స్కూల్ దగ్గర, వెంకటేశ్వర స్వామి ఆర్చ్, బ్లూ బెర్రి షాపు పైన, విజయనగరం.

పిటిషనర్లు పై నెంబరు గల పిటిషన్‌ను పై కోర్టులో దాఖలు చేయగా పై కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినను సదరు నోటీసులు మీరు అందుకోకుండా ఉన్నందున పై కోర్టువారు ఆర్డరు జారీ చేసిన విధముగా ఈ నోటీసు పత్రికా ప్రకటన మూలముగా జారీ చేయడమైనది. పై నెంబరు గల పిటిషన్ను పైన ఉదహరించిన కోర్టు వారి ఎదుట **తే.25-06-2025దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు స్వయముగా గాని, లేదా మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ యొక్క అభ్యంతరములను తెలియజేయవలెను. లేని యెడల పై కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్మానించుట జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

P. హరగోపాల్
అడ్వకేట్, విజయనగరం
Cell No.:9440721142

IN THE HONOURABLE COURT OF THE III ADDL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S. 840/2022

Between:
Smt. Nakka Satyavathi ...Plaintiff
And:
Nakka. Mangamma & 16 others ...Defendants

Summons To D15

To,
D15,
Nakka. Parvathi W/o Krishna
and D/o late Sambasiva Rao residing at, D.No, Aaadhar No. and Phone No. Not known to the plaintiff, Highway Road, Near Kota, Vizianagaram Dist Vizianagaram Pin- 535002.

Please take Summons/ Notice in the above matter where the appearance of the above stated defendant No. 15 stand posted **23-06-2025** before the above mentioned Hon'ble Court by **10:30 AM,** personally or any advocate duly authorized by you on your behalf of to give answer, in the above matter, failing which, the matter will be decided in your absence and proceed the above matter against you

(By the order of the court)
S.V. RATNAKAR RAO
Advocate, Visakhapatnam

IN THE HONOURABLE COURT OF THE III ADDL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A.No.376/2022 in O.S.840/2022

Between:
Smt. Nakka Satyavathi ...Petitioner/Plaintiff
And:
Nakka. Mangamma & 16 others ...Respondents/ Defendants

NOTICE To R15

To,
R15,
Nakka. Parvathi W/o Krishna
and D/o late Sambasiva Rao residing at, D.No, Aaadhar No. and Phone No. Not known to the petitioner/ plaintiff, Highway Road, Near Kota, Vizianagaram Dist, Vizianagaram Pin- 535002.

Please take Notice in the above matter where the appearance of the above stated Respondent No. 15 stand posted **23-06-2025** before the above mentioned Hon'ble Court by **10:30 AM,** personally or any advocate duly authorized by you on your behalf of to give answer, in the above matter, failing which, the matter will be decided in your absence and proceed the above matter against you

By the order of the court)
S.V. RATNAKAR RAO
Advocate, Visakhapatnam